క్లుప్తంగా

యోగాతో ఆరోగ్యం పదిలం


యోగా చేస్తున్న విద్యార్థులు

అట్లూరు : మన ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే ప్రతిఒక్కరు యోగా చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయ ఆవరణలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా 28 మంది విద్యార్థులకు రామాయణం, యోగా, ధ్యానం నేర్పించడంతో పాటు పుస్తక పఠనం నిర్వహించారు. అనంతరం ప్రతిఒక్కరూ భారతీయ సంప్రదాయ కట్టుబాట్లకు రామాయణం ఎంతో దోహదపడుతుందని, అలాగే ఆరోగ్యం పదిలంగా ఉండేందుకు చక్కటి యోగా, వ్యాయామం అవసరమని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీకి ఎమ్మెల్యే కృతజ్ఞతలు


గోవిందరెడ్డి దంపతులను సత్కరిస్తున్న సుధ

పోరుమామిళ్ల: బద్వేలు అసెంబ్లీ నుంచి రెండోసారి మెజారిటీతో గెలిపించినందుకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ సుధ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం గోవిందరెడ్డి దంపతులను సుధ సన్మానించారు. ఎమ్మెల్సీ కృషి వల్లే తనకు మరోసారి విజయం దక్కిందన్నారు. రాష్ట్రమంతా కూటమికి జై కొట్టగా, బద్వేలులో ప్రజలు తనను గెలిపించారని తెలిపారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి కుమారుడు ఆదిత్యారెడ్డి, కోడలు సాహితీరెడ్డితో పాటు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలి


మాట్లాడుతున్న విజయ్‌కుమార్

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో ఏర్పడబోయే నూతన ప్రభుత్వం విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.వి జయకుమార్ పేర్కొన్నారు. బుధవారం యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ ప్రకటిస్తూ మొదటి సంతకం చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 28 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అలాగే 117 జీఓను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయాలని కోరారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయాలి


మాట్లాడుతున్న జగన్, ఓబులేసు

ప్రొద్దుటూరు : నూతన ప్రభుత్వం జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయాలని ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు కోరారు. బుధవారం ప్రొద్దుటూరులో వారు మాట్లాడుతూ పరిశ్రమను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను, పరిశ్రమలను, యూనివర్సిటీలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ఇది మల్లెల.. మాసం



విక్రయానికి సిద్ధంగా ఉన్న మల్లెపూలు

పులివెందుల రూరల్ : మగువల మనసు దోచుకునే మల్లెలు ప్రస్తుతం మార్కెట్లో గుమాలిస్తున్నాయి. పులివెందుల పట్టణంలో పూల అంగళ్ల దుకాణాల వద్ద దండలు కట్టి రాసులుగా పోసి విక్రయిస్తున్నారు. తోపుడుబండ్లపై ప్రధాన రహదారుల్లో మల్లెలు కనువిందు చేస్తున్నాయి. కదిరి, అనంతపురం, తదితర ప్రాంతాల నుంచి పులివెందుల ప్రాంతానికి మల్లెలు తెచ్చి వ్యాపారులు విక్రయిస్తున్నారు. పూలజడలకు, దండలకు డిమాండ్ పెరిగింది. కిలో మల్లె పూలు నాణ్యతను బట్టి రూ.100ల నుంచి రూ.150ల వరకు విక్రయిస్తున్నారు. తోపుడుబండ్లపై పావు పూలు రూ.10కి ఇస్తుండటంతో మహిళలు వాటిని కొనకుండా ఉండలేకపోతున్నారు.

పచ్చదనం పుడమికి అలంకారం

- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- మొక్కలు నాటిన అధికారులు
- పర్యావరణ పరిరక్షణపై అవగాహన


కాశినాయన : మొక్కలు నాటుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మిదేవి, అంగన్‌వాడీ సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్ఓ దివాకర్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరు అటవీశాఖ కార్యాలయ ఆవరణం, రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో అటవీ అధికారులు బుధవారం మొక్కలు నాటారు. స్థానికులతో పాటు సీబీఐటీ కళాశాల విద్యార్థులను మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వామ్యం చేశారు. అనంతరం సబ్ డీఎఫ్ఓ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక కాలంలో కాలుష్యం పెరిగిపోతోందన్నారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటడం వల్ల కాలుష్యం తగ్గిపోతుందని చెప్పారు. ముఖ్యంగా యువత చొరవ చూపాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎఫ్ఆర్ఓ హేమాంజలి మాట్లాడుతూ యువత పర్యావరణం మీద అవగాహన పెంచుకొని పర్యావరణ రక్షణ దిశగా అడుగులు వేయాలన్నారు. అడవులతోపాటు నీటి సంరక్షణకు పాటు పడాలని చెప్పారు. ప్రొద్దుటూరులోని రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కును ప్రతి ఒక్కరూ సందర్శించి ప్రకృతిని ఆస్వాదించాలన్నారు. డీఆర్ఓ లక్ష్మీకుమార్, ఎఫ్‌బీఓ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

పర్యావరణ పరి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం డీఎస్పీ కార్యాలయ ఆవరణంలో ఆయన మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని డీఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. కాలుష్యాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మొక్కలను నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చెట్లు లేకపోతే మానవజాతి మనుగడకే ముప్పు వాటిల్లుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సైన్స్ కాంగ్రెస్ జిల్లా కోఆర్డినేటర్ డీవీ సుబ్బానాయుడు పేర్కొన్నారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపీ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామీకరణ వలన గ్లోబల్ వార్మింగ్ పెరిగి తీవ్ర దుష్పరిణామాలకు దారితీస్తోందన్నారు. పర్యావరణ రక్షణకు విద్యార్థులు నడుంబిగించి మొక్కలు విరివిగా పెంచి వాటిని పరిరక్షించాలన్సిన ఆవశ్యకత ఉందన్నారు. జేవీవీ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్, జేవీవీ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్లాస్టిక్‌ను విరివిగా వాడటం వలన కలిగే అనర్థాలను, కాలుష్యం పెరగడం వలన ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వ్యాస రచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందచేశారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న, సునీత, అక్షయ, హాసిని, భరత్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం గ్రామంలో


మొక్కలు నాటుతున్న ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్

శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస ప్రసాద్ కరువు పరిస్థితులను ఎదుర్కోవడానికి ఇంకుడు గుంతల తవ్వకం, నీటి నిల్వ పద్ధతులను గ్రామస్తులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు అపరిశుభ్రమైన నీటిని పరిశుభ్రమైన నీటిగా మార్చుకునే విధానంపై అవగాహన కల్పించారు. ప్రయోగం చేసి ప్రజలకు అర్థమయ్యేలా స్వచ్ఛమైన నీటిని ఎలా పొందవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్లు ఇందిర, జ్యోతి, పాండురంగా రెడ్డి, వాణి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మొక్కలు పెంచడం అందరి బాధ్యత

బద్వేలు అర్బన్ : మానవాళి మనుగడలో చెట్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, ఇలాంటి పరిస్థితులలో ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం బాధ్యతగా తీసుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా బుధవారం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో అటవీశాఖ సిబ్బంది, బార్ అసోసియేషన్ న్యాయవాదులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా



ప్రొద్దుటూరు : స్వచ్ఛమైన నీటిని ఎలా పొందాలో వివరిస్తున్న అధికారులు


ప్రొద్దుటూరు కల్చరల్ : పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో జేవీవీ నాయకులు

ఆమె మాట్లాడుతూ వాతావరణంలో సంభవిస్తున్న అనేక రకాల మార్పులకు ముఖ్య కారణం చెట్లు అంతరించి పోతుండమేనని ఇటీవల కాలంలో అధ్యయనాలు తెలుపుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ చెట్లను సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ వెంకట శేషయ్య, ఎఫ్ఎస్‌వో ఖాజావలి, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అటవీ కార్యాలయంలో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక సిద్దవటం రోడ్డులోని అటవీశాఖ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ పర్యావరణానికి హాని కల్గించే ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని ప్రతి ఒక్కరూ నిషేధించాలని కోరారు.

పోరుమామిళ్ల: పచ్చదనం పుడమికి అలంకారమని, పర్యావరణాన్ని కాపాడుకుందామని పోరుమామిళ్ల ఫారెస్టు రేంజర్ రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం టీచర్స్ కాలనీ పార్కు వద్ద, విశ్రాంత భవనం వద్ద వేప, కానుగ, గంగిరావి, వెలగ తదితర 250 మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని, విచక్షణా రహితంగా అడవులు నరకడం వలన సమాజానికి తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు. విశ్రాంత ఎంఈఓ రత్నస్వామి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గురుమూర్తి, ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, బొల్లు రామమోహన్, ఫారెస్టు అధికారులు శ్రీరమణ, కరుణాకర్, భారతి, కృష్ణ, కిశోర్, వెంకటేష్, అంజి పాల్గొన్నారు.

పర్యావరణ హితం.. ఆరోగ్యభాగ్యం

కాశినాయన : పర్యావరణ హితం ఆరోగ్యభాగ్యమని పోరుమామిళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మీదేవి అన్నారు. బుధవారం మండలంలోని నరసాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. భవిష్యత్ తరాలకు మనం నాటిన మొక్కలు పెద్ద చెట్లుగా మారి మనకు కావాల్సిన ఆక్సిజన్‌ను ఇవ్వడంతో పాటు చల్లని వాతావరణం ఇస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మొక్కలు నాటే విధంగా ప్రోత్సహించాలని, అలాగే మొక్కల వలన కలిగే ప్రయోజనాలు వివరించాలని తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, పిల్లలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

మైదుకూరు: పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ, వనిపెంట అటవీక్షేత్రాధికారి ప్రణీత్‌రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం కృషి విజ్ఞాన కేంద్రంలో పర్యావరణంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలని సూచించారు. చెట్లను పెంచడం వల్ల భూమిలో కర్బన శాతం పెరుగుతుందని, తద్వారా పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని పేర్కొన్నారు. అనంతరం కేవీకే ఆవరణలో పలు రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీవిద్యారాణి, కాంతిశ్రీ, ఫిరోష్ హుస్సేన్, ఫారెస్ట్ బీట్ అధికారులు లింగారెడ్డి, సురేఖ, రామమోహన్, రామయ్య, ఈశ్వరమ్మ, సుచరిత, సురేంద్ర, సహాయ బీట్ అధికారులు నాగలక్ష్మి, సునీత, గంగాధర్, చాంద్‌బాషా, ఉద్యాన విద్యార్థులు పాల్గొన్నారు.

మెదుకూరు ఆర్టీసీ డిపో అధికారుల ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మైదుకూరుకు చెందిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు డిపో ఆవరణలోని పెట్రోలు బంకు పరిసరాల్లో మొక్కలను నాటారు. డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఏడీసీ సిద్ధయ్య, లక్ష్మయ్య, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు గోపాల్, ప్రసాద్, రామ్మోహన్, సుబ్బరాజు, వనిత క్లబ్ ప్రతినిధులు కరమలపూటి జ్యోతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సచివాలయంలో..

మండలంలోని ఆదిరెడ్డిపల్లె గ్రామ సచివాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వనిపెంట అటవీక్షేత్రాధికారి ప్రణీత్ రావు, అటవీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు సచివాలయ ఆవరణలో మొక్కలను నాటారు.



పోరుమామిళ్ల: మొక్కలు నాటుతున్న అధికారులు


ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు అటవీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న సబ్‌డీఎఫ్ఓ, ఎఫ్ఆర్ఓ, సిబ్బంది


బద్వేలు అర్బన్ : కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి


మైదుకూరు : కేవీకే ఆవరణలో మొక్కలను నాటుతున్న శాస్త్రవేత్తలు, అటవీశాఖ అధికారులు

కన్నుల పండువగా కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాస శివరాత్రి సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి ఆలయ ప్రాంగణం కాలక్షేప మండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవోపేతంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. కార్యక్రమానంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాగా గురువారం అమావాస్య సందర్భంగా స్వామి వారికి ఉజ్జయిని మహాకాళేశ్వరుని వలే పూజా, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు భస్మహారతి జరుగనుంది. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ కోరారు.


హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు


కల్యాణోత్సవంలో గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరుడు

ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్

పోరుమామిళ్ల: దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ అవినీతి తారాస్థాయికి చేరిందని, ఉన్నతాధికారులు విచారణ జరిపి సస్పెండ్ చేయాలని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి భైరవప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఆలయాల అభివృద్ధి పట్టించుకోకుండా ఆదాయాల కొరకు కాంప్లెక్స్‌లు, ఆలయ స్థలాలు తనకు అనుకూలమైన వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ట్రస్టులో వారసులను కాకుండా బయట వ్యక్తులను నియమించి నిధులను కాజేస్తున్నారని తెలిపారు. మద్దిమానుగురప్పస్వామి, బ్రహ్మంగారిమఠం, ప్రొద్దుటూరులోని ఆలయాలకు సంబంధించి ఆయనపై అవినీతి ఆరోపణలున్నాయన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గౌసియాబేగం, సుందరయ్య, రవి, రత్నం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భైరవప్రసాద్

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి


రికార్డులను పరిశీలిస్తున్న రాజేంద్రప్రసాద్

వేంపల్లె : ఖరీఫ్ సాగు కోసం రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ ఎరువుల దుకాణ యజమానులకు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన వేంపల్లెలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆయన తనిఖీ నిర్వహించారు. అలాగే విత్తనాలకు సంబంధించి స్టాక్ నిలువ రికార్డులు, ధరల పట్టికను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 2024–25 ఖరీఫ్ సీజన్‌లో భాగంగా ఎక్కడా కూడా నకిలీ విత్తనాలు అమ్మరాదని, అలాగే విక్రయ రసీదును రైతులకు ఖచ్చితంగా ఇవ్వాలని ఆదేశించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిగ్రీ ప్రవేశానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు

వేంపల్లె : 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రవేశానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ హెల్ప్ డెస్క్ ద్వారా డిగ్రీ ప్రవేశానికి ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ కళాశాల ఏర్పాటైన మూడేళ్ల సందర్భంగా ఐదు కోర్సులకు అదనంగా కొత్తగా బీఎస్సీ హానర్స్ బాటనీ కోర్సును అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని వేంపల్లె పరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే బీఏ హిస్టరీ, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, మాథ్స్, కెమిస్ట్రీ కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 మంది పీహెచ్‌డీ కలిగిన అధ్యాపకుల బృందంతో బోధన జరుగుతుందన్నారు. అలాగే ఎన్ఎస్ఎస్, స్పోర్ట్సు అండ్ గేమ్స్, రెడ్ రిబ్బన్, క్యాంపస్ డ్రైవ్‌తో పాటు ఆధునిక పద్ధతుల్లో బోధన నిర్వహించబడుతుందన్నారు. కళాశాల నుంచి దాదాపు 150 మంది విద్యార్థులు డిగ్రీ ఉత్తీర్ణులై కడప, బెంగుళూరు నగరాల్లోని ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు పొంది ఉన్నారన్నారు.

నైతిక విలువలతోనే మెరుగైన సమాజం

ప్రొద్దుటూరు కల్చరల్ : నైతిక విలువలు పెంపొందించడంతోనే మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమని విశ్రాంత వైమానిక దళ అధికారి వెంకటకొండయ్య పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని సూచించారు. స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులకు నీతి కథలు వివరించారు. చదువుతో పాటు సంస్కారం, నైతిక విలువలు, పెద్దల పట్ల గౌరవం కలిగి ఉండాలని, చదువు ప్రాముఖ్యతను తెలిపారు. చిన్నారులకు ఈ సందర్భంగా ఖోఖో ఆటలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నిర్మలజ్యోతి, రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటకొండయ్య

లింగ వివక్ష విడనాడాలి

కమలాపురం : లింగ వివక్ష విడనాడాలని, భవిష్యత్తు అమ్మాయిలదేనని పెద్దచెప్పలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మహినూర్ తెలిపారు. బుధవారం పీహెచ్‌సీ పరిధిలోని కిషోర బాలికలకు, తల్లులకు లింగ వివక్ష పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో లింగ వివక్ష విడనాడాలన్నారు. లింగ నిర్ధారణ చేయడం నేరమని, చేయించుకున్న వారికి, చేసే వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదన్నారు. అలాగే లింగ నిర్ధారణ చేసే ఆసుపత్రుల అనుమతులు రద్దు చేసి మూసివేస్తామన్నారు. సమాజంలో మహిళలు, పురుషులు సమానం అని, భవిష్యత్తు అంతా అమ్మాయిలదేనన్నారు. ఆడపిల్లలను రక్షిద్దాం.. ఆడపిల్లలను చదివిద్దాం..అని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయకుమారి, షంషాద్, సుబ్బమ్మ, భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు. అలాగే కమలాపురం పట్టణంలోని 7వ వార్డు అంగాన్‌వాడీ కేంద్రంలో 1వ సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీలు నిర్వహించిన సమావేశంలో ఎంఎస్‌కే పద్మజ, ఏఎన్ఎం ధనలక్ష్మీలు తల్లులకు లింగ వివక్ష పట్ల అవగాహన కల్పించారు. నేటి ఆడపిల్లే రేపటి అమ్మ అని, ఈ రోజు ఆడపిల్లను వద్దనుకుంటే ఓ తల్లిని, ఓ సోదరిని, ఓ స్నేహితురాలిని, ఓ భార్యను, ఓ బామ్మని కోల్పోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.


కమలాపురంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

పెరుగుతున్న టమాటా ధరలు

మదనపల్లె సిటీ : టమటా ధరలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. ధరలు పెరుగుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లె మార్కెట్‌కు గత రెండు నెలలు నుంచి టమటాలు వస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దిగుబడులు తక్కువ. ధరలు పుంజుకుంటున్న సమయంలో దిగబడులు తగ్గాయి. పెరుగుతున్న ధరలు చూసి రైతులు టమటా సాగుపై మొగ్గు చూపుతున్నారు. మదనపల్లె మార్కెట్‌లో మంగళవారం మొదటి రకం 10 కిలోలు రూ. 660 పలికింది. రెండో రకం 10 కిలోలు రూ.520 పలికింది. 349 మెట్రిక్ టన్నుల కాయలు వచ్చాయి. గత వారం రోజుల నుంచి ధరలు చూస్తే ధరలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి.


మార్కెట్‌కు వచ్చిన టమాటాలు